క్లుప్తంగా...

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

పద్మారావునగర్: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకొని వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ప్రకటించారు. ఆదివారం మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్య నగర్ గాస్‌మండి వాలీబాల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 6 వరకు తలసాని ట్రస్ట్ అధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వాలీబాల్ కోచ్ నందు, బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, ఓదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

లాలాపేట: లాలాపేట కుమ్మరి సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఉప్పలంచి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఉప్పలంచి నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా దాసారం మోహన్‌కుమార్, కోశాధికారి రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దేవరుప్పల వెంకటేష్, శ్రీధర్ ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: బీఆర్ఎస్ ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని లాస్య నందిత అన్నారు. కంటోన్మెంట్ ఐదోవార్డులోని మహాత్మాగాంధీ నగర్‌లో ఆదివారం ఆమె పాదయాత్ర నిర్వహిస్తూ మాట్లాడారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కేసీఆర్ సర్కారుకు మద్దతు పలకాలని కోరారు. దివంగత నేత సాయన్న ఆశయాలకు అనుగుణంగా తాను నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నివేదిత, పెద్దాల నర్సింహ, పెంట శ్రీహరి, గంట రాజు, నాగేందర్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: మహబూబ్‌నగర్‌లో జరిగిన సభలో మేడారం సమ్మక్క సారలమ్మ పేరు మీద గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మించనున్నట్లు ప్రధాని మంత్రి మోదీ ప్రకటించడం హర్షణీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ నాయకులు ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో దిలీప్ నాయక్ ఆధ్వర్యంలో బాణాసంచా కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్, నగరపు శ్యామ్, యాదగిరి, సాయిదత్తు, పాస్‌పోర్ట్ శ్రీను పాల్గొన్నారు.

'పోరాట ఫలితమే ట్రైబల్ వర్సిటీ'



మాట్లాడుతున్న శరత్‌నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: గత ఆరేళ్లుగా పోరాడుతున్న ఫలితమే ట్రైబల్ యూనివర్సిటీ స్థాపనకు మూలమని గిరిజనశక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ అన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్ సభలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రకటన చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంతో పాటు దేశంలో ఉన్నత విద్యలో వెనుకబడిన గిరిజన, ఆదివాసులకు ట్రైబల్ వర్సిటీ స్థాపనతో న్యాయం జరుగుతుందన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి, మలిదశ ఉద్యమంలో 40 మంది గిరిజనులు బలిదానాలు ఇచ్చారని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీల అభివృద్ధికి అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బునాయక్, రమేష్‌రాథోడ్, సుధీర్‌నాయక్ పాల్గొన్నారు.

ఫ్యాన్‌ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేవనార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు రూ. లక్ష విలువ చేసే ఫ్యాన్‌లను పంపిణీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణ, చక్రపాణి, రామనందం తెలిపారు. వారు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా తాము సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు నవీన్, శాంతి, విశ్వనాథం, ఆర్.మురళీకృష్ణ, సతీష్, పద్మ, వసంత, శ్రీదేవి, సంపత్‌రెడ్డి, మాధవరావు, ప్రసాద్, శంకర్‌రావు, శ్రీనివాస్ ఉప్పల, నారాయణమూర్తి తదితరులున్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



లాలాపేటలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పరిసరాల్లోని చెత్త, వ్యర్థాలను తొలగించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పరిసరాల పరిశుభ్రత మనందరీ బాధ్యత అన్నారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



చీపురు పట్టి ఊడుస్తున్న డాక్టర్ వెంకటి



తార్నాకలో శ్రమదాన కార్యక్రమంలో రోడ్లు ఊడుస్తున్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి



రోడ్లు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, ఇండియన్ హాకీ టీమ్ మాజీ కెప్టెన్ ముఖేష్



స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ



కార్యక్రమంలో పాల్గొన్న బోర్డు సీఈఓ, సిబ్బంది, స్థానికులు



కార్యక్రమంలో పాల్గొన్న మెడికల్, బోధన, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది



రోడ్డు ఊడుస్తున్న ఫిక్కీ సభ్యులు, విద్యార్థులు

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత కేసీఆర్‌దే

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్: కులమతాలకు అతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో అమలు జరగని పథకాలు బీఆర్ఎస్ హయాంలో కొనసాగుతున్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, లింగాని శ్రీను, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

అడ్డగుట్టకు చెందిన వివిధ పార్టీల నేతలు, వడ్డెర సంఘం సభ్యులు ఆదివారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడిగా వ్యవహరించిన రోజు నుంచే సీఎం కేసీఆర్‌కు ప్రజా సంక్షేమం పట్ల పూర్తి ఆలోచన ఉందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనను సాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. బలదేవ్‌రాజ్, బాలరాజ్, శివకుమార్, నరసింహ, కుమార్, స్వామి, రాజు, బాబు బీఆర్‌స్‌లో చేరారు.



చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కృష్ణమోహన్‌రావు

రసూల్‌పురా: తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో సైమా–2023 బ్యూటీ ఎక్స్‌పో ప్రదర్శనను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో మల్టీ లోఖల్ ట్యాలెంట్ కొదవ లేదన్నారు. యువ పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్‌లో పలు అవకాశాలు ఉన్నాయన్నారు. సైమా డైరెక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. మూడ్రోజుల పాటు జరిగే ఈ సైమా బ్యూటీ ఎక్స్‌పోలో సెమినార్లు నిర్వహిస్తున్నామని ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో సౌందర్య పోషణ ఉత్పత్తులు, వస్త్రాలంకరణ, ఉత్పత్తులు డిజైనింగ్ ఆభరణాలు, తదితర వస్తువులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమార స్వామి, ప్రొ. రేఖారావు, పూజాగుప్తా, నర్మద, కవిత, సంధ్య అయాన్ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

చిలకలగూడ: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ముస్లిం సోదరులు చిలకలగూడ ఠాణా పరిధిలోని మసీదులు, ఛిల్లాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలు, జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని వారాసిగూడ కౌసర్ మసీదు వద్ద ప్రారంభమైన ర్యాలీ మోరంబండ, పద్మారావునగర్, చిలకలగూడ చౌరస్తా, గాంధీ విగ్రహం, సీతాఫల్‌మండి, నామాలగుండు, వారాసిగూడ మీదుగా అంబర్‌నగర్ ఛిల్లా వరకు కొనసాగింది. చిలకలగూడ, వారాసిగూడ, సీతాఫల్‌మండి, బడేమసీదు తదితర ప్రాంతాల్లో షర్బత్ పంపిణీ చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ మట్టంరాజు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామాలగుండు చౌరస్తా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు మిలాద్ ర్యాలీకి స్వాగతం పలికి శీతల పానియాలు, బిస్కట్లు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు, డేటా అండ్ టెక్నాలజీ నేషనల్ కోఆర్డినేటర్ దీపక్‌జాన్ శ్రీనివాసనగర్‌లో జరిగిన మిలాద్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో షకీల్‌ఖాన్, వహిదుద్దీన్, యూసఫ్, సాదిక్, మెహమూద్, ముగ్దూమ్, అబుషేర్, జగ్గు, సురేష్‌లాల్, ఎమ్మార్ శ్రీనివాస్, అభిషేక్, మయబ్రహ్మ, మహేష్, వెంకట్, కిరణ్ పాల్గొన్నారు.



ర్యాలీకి స్వాగతం పలుకుతున్న నోముల ప్రకాశరావు

గడప గడపకూ బీఆర్ఎస్

చిలకలగూడ : సీఎం కేసీఆర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు కృషి ఫలితంగా తెలంగాణతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్, ఉప్పరిబస్తీ, కిందిబస్తీ, శ్రీనివాసనగర్, వేంకటేశ్వరనగర్, ప్రైడేమార్కెట్, నామాలగుండు తదితర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించిన ప్రగతిపథంలో సికింద్రాబాద్ పేరిట ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి అందించి అవగాహన కల్పించారు. సుమారు రెండేళ్ల నుంచి సొంత నిధులతో అనేక అవగాహన, సామాజిక కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. ఓటరు నమోదుపై ప్రజల్లో చైతన్యం కల్పించి, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసి 3500 మంది అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించినట్లు తెలిపారు. . రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కానుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



కరపత్రాలను అందిస్తున్న చంద్రశేఖర్

పేదల సౌకర్యార్థం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి వర్గాలు నామమాత్రపు ఛార్జీలతో శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాల కోసం మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పాన్‌బజార్‌లో రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫంక్షన్ హాళ్ల కోసం పేద మధ్య తరగతి వర్గాలు లక్షలాది రూపాయలు చెల్లించి వివాహాది శుభకార్యాలు చేసుకోవడం కష్టతరంగా మారిందన్నారు. ప్రజల ఇబ్బందులు దూరం చేయడానికి సకల సదుపాయాలతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎ. శ్రీనివాస్, మల్లేష్, ఇ. శ్రీనివాస్, దీపక్, ఎం. శ్రీనివాస్, గణేష్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. మతం పేరిట రాజకీయ లబ్ధిపొందడం, ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం బీజేపీ లక్ష్యంగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశన్, సురేష్, రాజు, శివ, వినోద్ పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం..

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ వాసుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి తలసాని అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్‌లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ సమీపంలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పాటిగడ్డలో బంగారు మహేశ్వరి దేవాలయ సమీపంలో రూ.19.40 లక్షలతో చేపట్టన్ను సీసీ రోడ్డు, ఎయిర్‌లైన్స్ కాలనీలోని పార్కులో జిమ్ పరికరాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. బేగంపేట పాటిగడ్డలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు పాల్గొన్నారు.

● బల్గేరియాలో వరల్డ్ రైల్వే ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ టెన్నిస్ పోటీల్లో బంగారం పతకం సాధించిన బండిమెట్‌కు చెందిన పొన్నాల సిద్ధార్థ్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆకుల హరికృష్ణ, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఇంట్లో చెప్పకుండా ఇద్దరు.. భర్తతో గొడవపడి ఒక్కరు

వేర్వురు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. లోహియనగర్‌కు చెందిన కొలపాక మహాలక్ష్మి(18) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మహాలక్ష్మి

● దోమలగూడ ప్రాంతానికి చెందిన గోపె వైష్ణవి (22) రెండేళ్లుగా మహేంద్రాహిల్స్ టీఎంసీ కాలనీలోని ఓ ఇంట్లో పని చేస్తుంది. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ఇంటి యజమాని వైష్ణవికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



గోపె వైష్ణవి

● అడ్డగుట్ట కమ్యూనిటీహాల్ సమీపంలో నివాసముంటున్న దీపిక(26) బాలాజీ దంపతులు. శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయిన దీపిక ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భర్త బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



దీపిక

లంక అర్జున్ మృతి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడకు చెందిన లంక అర్జున్(58) మరణించాడు. గత కొంత కాలం నుంచి అస్వస్థతతో బాధపడుతున్న అర్జున్ కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న మంత్రి తలసాని అర్జున్ మృతదేహానికి నివాళులర్పించారు.

దాండియా ఉత్సవాలకు సర్వం సిద్ధం



కంటోన్మెంట్: ప్రతీయేటా నవరాత్రుల్లో భాగంగా నగర వ్యాప్తంగా నిర్వహించే దాండియా ఉత్సవాల కోసం ఉత్తర భారతీయులు అధిక సంఖ్యలో ఉండే కంటోన్మెంట్‌లో సర్వం సిద్ధం చేస్తున్నారు. ఎస్‌కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్ ఆవరణలో ఈ నెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ప్రతీ రోజు సాయంత్రం 7.00 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు శ్రీకాంత్, వంశీ, అఖిల్, అభినయ, రాజ్, శ్యామ్, వెంకట్, మౌనిక, తేజ, రుమిస్ తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాచిగూడ: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర భూమన్నలేన్, లింగంపల్లి రాఘవేంద్రస్వామి టెంపుల్‌లేన్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాలనీల్లో సమస్యలు లేకుండా సీవరేజ్ పైపులైన్ల ఆధునీకరణ, సీసీరోడ్లు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ నేతలు డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, ఎర్ర భీష్మదేవ్, దిడ్డి రాంబాబు, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, పెంట రమేష్, కృష్ణాగౌడ్, సునీల్ బిడ్లాన్, బద్దుల శ్రీకాంత్, మహేష్, విజయ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, ఎస్ఎస్ రాము తదితరులున్నారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. రమేష్‌రెడ్డి, పి.వి.నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం ప్రతిమా ఆసుపత్రి కాచిగూడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని వాకర్స్ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజూ వాకింగ్ చేయాలని సూచించారు. వాకర్స్ క్లబ్ ముఖ్య సలహాదారులు వెంకటకృష్ణారావు, కోశాధికారి డాక్టర్ సునీల్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, పద్మానరేష్, శ్రీదేవి, కృష్ణ తదితరులున్నారు.